

డిఎస్‌పి విచారణ

టెక్కలి : మండలంలోని పెదసాన ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఎలుగు ప్రసాద్‌ని ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీ కులం పేరుతో దూషించారని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు మేరకు డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి సోమవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పాఠశాల విధులు నిర్వహిస్తున్న



విచారణ చేపడుతున్న డిఎస్‌పి మూర్తి

ఉపాధ్యాయులు సిబ్బంది బాధితుల ఫిర్యాదులను సేకరించారు. వాస్తవ ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టారు.

సమస్యలపై సమర శంఖారావం

- ఐటిడిఎ లేక సమస్యలను చెప్పకోలేని గిరిజనం
- గ్రామాలను నోటిఫైడ్ ఏజెన్సీగా గుర్తింపులో నిర్లక్ష్యం
- గిరిజన గూడేల్లో కొరవడిన మౌలిక వసతులు
- గిరిజనోత్పత్తులకు దక్కని గిట్టుబాటు ధర
- నేడు గిరిజనుల చలో కలెక్టరేట్

గిరిజనుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్తున్నా, వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని తమ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీలు ఏళ్ల తరబడి చేస్తున్న ఆందోళనలు అరణ్యరోదనగానే మిగిలాయి. జిల్లాల పునర్విభజన తర్వాత ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జిఒ నంబరు 3, భూముల అన్యాక్రాంతం వంటి అనేక అంశాలపై వారు పలురూపాల్లో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద మంగళవారం నిర్వహించే ధర్నాకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



ధర్నాపై గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల పునర్విభజనకు ముందు సీతంపేట ఐటిడిఎ కేంద్రంగా గిరిజనులకు సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యేవి. ఆదివాసీల సమస్యలూ కొంత పరిష్కారమయ్యేవి. శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, భామిని మినహా మెజార్టీ మండలాలు జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలోనే ఉన్నాయి. ఐటిడిఎ పరిధిలోని మిగిలిన 16 మండలాల్లో 1.60 లక్షల మంది జనాభా ఉన్నారు. జిల్లాల పునర్విభజన నాటి నుంచి జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ గిరిజనులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. ఆందోళనల ఫలితంగానే వైసిపి ప్రభుత్వ హయాంలో మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని నాటి ప్రభుత్వ పెద్దలు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాతపట్నం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చినా ఇప్పటివరకు ఒక్క అడుగు పడలేదు.

ఐదో షెడ్యూల్ అంశంపై పాలకుల ఉదాసీనం

తమ పంచాయతీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలంటూ గిరిజనులు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్నారు. సీతంపేటలో 24 పంచాయతీలు ఉండగా, కేవలం16 పంచాయతీలు మాత్రమే ఐదో షెడ్యూల్‌లో ఉన్నాయి. ఏజెన్సీ పరిధిలోని 740 గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజనులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. నాటి వైసిపి పభుత్వం 704 గ్రామాలను మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. దీంతో గిరిజనులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. మరోవైపు గిరిజనుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయి.

నీరుగారుతున్న 1/70 చట్టం

గిరిజనుల హక్కులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్న 1/70 చట్టం అమలు జిల్లాలో నీరుగారుతోంది. వంశపారంపర్యంగా వారికి సంక్రమించిన భూములను సైతం ఆక్రమించుకునేందుకు వైసిపి నేతలు, పెత్తందారులు గత ఐదేళ్లలో అనేక రకాల ప్రయత్నాలు సాగించారు. అధికారులతో కుమ్మక్కై రికార్డులను మార్చి వారికి అన్యాయం చేసేందుకు ప్రయత్నించారు. మందస, కంచిలి మండలాల్లో గిరిజనులు సాగులో ఉన్న సుమారు వెయ్యి ఎకరాలను తప్పుడు పేర్లు, రికార్డులతో మార్పులు చేసి ఆదివాసీలకు అన్యాయం చేసేందుకు ఒడిగట్టారు. భూములకు రక్షణ లేని నేపథ్యంలో గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు కోరుతున్నారు.

జిఒ నంబరు 3కి వ్యతిరేకంగా గిరిజనుల పక్షాన పోరు

ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం జిఒ నంబరు 3 తీసుకొచ్చింది. అప్పట్నుంచి వేలాది మంది ఆదివాసీ యువత ఉపాధ్యాయ, ఉద్యోగాలు పొందుతున్నారు. జిఒ నంబరు 3తో గిరిజనేతరులకు అన్యాయం జరుగుతుందంటూ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ నిరుద్యోగి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో 2022 ఏప్రిల్ 22వ తేదీన జిఒ నంబరు 3ను రద్దు చేసింది. దీనిపై గిరిజనులు అనేక రూపాల్లో పోరాడుతూనే ఉన్నారు.

పంటలకు దక్కని గిట్టుబాటు ధర

గిరిజనులు పండించే పంటలు కొనుగోలు చేసేందుకు గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడంతో జీడిపిక్కలు, చింతపండు, చీపుర్లు తదితర ఉత్పత్తులను తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వీటితోపాటు ఇతర అనేక సమస్యలు పరిష్కారం కాక అపరిష్కృతంగానే ఉన్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేక వాగులు, బోర్లు, చేతిపంపులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొంది. వీటిపై తమ నిరసన గళం వినిపించేందుకు గిరిజనులు సిద్ధమవుతున్నారు.



కొత్తూరు : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

డిఇఒ వైఖరిపై నల్లరిబ్బన్లతో నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం, కొత్తూరు

ఇటీవల కుప్పిలిలో పదో తరగతి పరీక్షా కేంద్రంలో అక్రమంగా ఉపాధ్యాయులపై సస్పెండ్ వేటు వేసిన జిల్లా విద్యాశాఖాధికారి వైఖరికి నిరసనగా శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం నల్లరిబ్బనులు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఫోర్టో చైర్మన్, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి జిల్లా వైస్ చైర్మన్ పిసిని వసంతరావు మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష రోజు కుప్పిలి పరీక్షా కేంద్రంలో డిఇఒ, వారి బృందం ప్రశాంతంగా నిర్వహిస్తున్న నిర్వహించిన పరీక్షల్లో భయానక వాతావరణం సృష్టించారని అన్నారు. పాఠశాలలో నిరసన తెలియజేసిన వారిలో తాండ్ర వెంకటరమణ, బుడుమూరు అప్పలనాయుడు, బెండి శారద, షాజాది భాను, రాజనాల సతీష్ రాయుడు, బొంగు వెంకటరమణ, తంగి పద్మావతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ సస్పెండ్ ఎత్తివేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను డిమాండ్ చేశారు. కొత్తూరు మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు.

పొందూరు మండలంలోని పలు పాఠశాలల్లో భోజన విరామం సమయంలో ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

డిఇఒను తొలగించాలి

- నేటి నుంచి దశల వారీ ఆందోళన
- ఉపాధ్యాయ సంఘాల తీర్మానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతల్లో ఉన్న వమ్మరవల్లి డైట్ లెక్చరర్ ఎస్.తిరుమల చైతన్యను వెంటనే ఆ బాధ్యతల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఉపాధ్యాయుల సస్పెన్షన్‌పై నగరంలోని ఎన్‌జిఒ హోంలో సోమవారం నిర్వహించిన సమాఖ్య సమావేశంలో దశల వారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఉద్దేశపూర్వకంగా డిఇఒ తిరుమల చైతన్య తనిఖీల పేరుతో విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని ఇబ్బందులకు గురిచేశారని నాయకులు ఆరోపించారు. డిబార్ అయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిపై క్రిమినల్ కేసులు వెనక్కి తీసుకోవాలని, డిఇఒను విధుల నుంచి తొలగించాలని సమావేశంలో తీర్మానించారు. ఈనెల 25 నుంచి దశల వారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. 25న ఎన్‌జిఒ కార్యాలయం నుంచి నుంచి డిఇఒ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన, 26న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా, 27న కలెక్టరేట్ వద్ద ధర్నా, 29న డిఇఒ కార్యాలయం ముట్టడి, ఏప్రిల్ మూడో తేదీన పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ బహిష్కరించనున్నట్లు వెల్లడించారు.

అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తంగి మురళీమోహన్, ఎం.మదన్‌మోహన్, బమ్మిడి శ్రీరామ్మూర్తి, పొందూరు అప్పారావు, బి.వెంకటేశ్వర్లు, పేడాడ కృష్ణారావు, ఎస్.వి రమణ, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

'మీకోసం'కు 164 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆమదాలవలస నియోజకవర్గంలో ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుంటోందని సీనియర్ న్యాయవాది సువ్వారి గాంధీ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో ఆయన ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌ల తీర్మానాలు లేకుండా పొందూరు ఎంపిడిఒ, వి.ఆర్ గూడెం కార్యదర్శి ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని చెప్పారు. ఉపాధి చట్టాన్ని సైతం అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నందిగాం మండలంలో మండల పరిషత్ నిధులను ఎంపిపి, ఎంపిటిసిలకు తెలియకుండా మంత్రి అచ్చెన్నాయుడు ఒత్తిడితో అధికారులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని వైసిపి నాయకులు పేడాడ తిలక్, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ఫిర్యాదు చేశారు. స్థానిక సంస్థల పరిధిలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో మాస్ కాపీయింగ్ పేరుతో ఉద్దేశపూర్వకంగా విద్యాశాఖ అధికారులు డిబార్ చేశారని కుప్పిలి గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు పెన్షన్ మంజూరు చేయాలని పొందూరుకు చెందిన గాంధీ వినతిపత్రం అందజేశారు. మందస మండలం పిడిమందస సచివాలయం పరిధిలో రీసర్వే అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కుంటికోటకు చెందిన గుంట కుమారస్వామి కోరారు. కోటబొమ్మాళి మండలం తిలారు ఎస్‌సి కాలనీకి చెందిన గుడివాడ ప్రభావతి కుటుంబానికి 1975లో కేటాయించిన ఇంటి స్థలాన్ని గుర్తించి నిరభ్యంతర పత్రం అందజేయాలని దళిత సంఘ నాయకులు శ్రీను వినతిపత్రం అందజేశారు. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 164 వినతులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బెట్టింగ్ విష వలయం

- యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు
- నిర్వాహకులపై కఠిన చర్యలు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బెట్టింగ్ విష వలయం వంటిదని, అందులో చిక్కి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని, వారిపై కఠిన చర్యలు తప్పవని ఒక ప్రకటనలో హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్‌లను వినోదం కోసం చూడాలి తప్ప, కుటుంబాల్లో విషాదం నింపేలా ఉండకూడదని పేర్కొన్నారు. ఐపిఎల్ నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవారు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్థికంగా జీవితాలను నాశనం చేసే బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు బలవుతున్న వారిలో ఎక్కువ శాతం యువతే ఉంటున్నారని తెలిపారు. సులభంగా అధిక నగదును ఆర్జించవచ్చని ఆశ చూపుతూ బెట్టింగ్ ఊబిలోకి దించుతారని పేర్కొన్నారు. ఒక్కసారి దీనికి అలవాటు పడితే బయటకు రావడం కష్టమవుతుందని తెలిపారు. నష్టాలను భర్తీ చేసుకోవడానికి, చేసిన అప్పులు తీర్చడానికి నేర ప్రవృత్తి వైపు దారితీసి యువత దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్‌ని అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువు, ఉజ్వల భవిష్యత్‌పై దృష్టిసారించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారికి నచ్చజెప్పి ఆ ఊబి నుంచి బయటకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిస్తే డయల్ 112, 100కు గానీ సంబంధిత పోలీస్ అధికారులకు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షయ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంలో భాగంగా నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. ఏడు రోడ్ల కూడలి వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు క్రమం తప్పకుండా రెండు వారాల వరకు ఉంటే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందుల వాడకం ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల కోసం సమర్థవంతమైన చికిత్స అందించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మందులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. మందులు వాడితే ఆరు నెలల్లో తగ్గిపోతుందన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ మాట్లాడుతూ క్షయ అంటువ్యాధి అని, ట్యూబర్‌క్లోసిస్ అనే మైక్రో బ్యాక్టీరియా ద్వారా ఇది సంక్రమిస్తుందన్నారు. ఈ బ్యాక్టీరియాను రాబర్ట్‌కాక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం, ఛాతినొప్పి, సాయంకాలం జ్వరం, రాత్రి నిద్రలో చెమట పట్టడం క్షయ రోగి లక్షణాలని వివరించారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సన్యాసినాయుడు

జిల్లా క్షయ నివారణ అధికారి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ క్షయ నివారణలో వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే మందుల వాడకం ప్రారంభించాలని తెలిపారు. డాక్టర్ రేష్మి చక్రవర్తి మాట్లాడుతూ దగ్గు, జలుబు తదితరమైనవి ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. టిబి నిర్మూలనకు కృషి చేసిన వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. క్షయ వ్యాధితో చికిత్స పొందుతున్న పలువురికి పోషకాహారం కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, డిపిఎంఒ వాన సురేష్ కుమార్, డిపిఆర్‌ఒ కె.బాలమాన్‌సింగ్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం, మంత్రి వెంకటస్వామి, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎపిపిఎస్‌సి పరీక్షలు

- పటిష్ట ఏర్పాట్లు చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఆధ్వర్యాన మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై తన కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు ఎచ్చెర్లలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మూడు కేంద్రాలలో 25వ తేదీన 545 మంది, 26న 457 మంది, 27న 302 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, విశ్లేషకుడు గ్రేడ్-2, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలకు సంబంధించి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు (షిఫ్ట్-1), మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు (షిఫ్ట్-2) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షకు అరగంట ముందుగా గేట్లు మూసివేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, ఎపిపిఎస్‌సి ప్రతినిధులు ఈశ్వరి, పద్మప్రియ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ, హెచ్-సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షం

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట తదితర మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, కాలువలు నిండిపోయాయి. ఈదురుగాలితో కూడిన భారీ వర్షం గంట పాటు పడడంతో చెట్లు కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ఒకింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న చిన్న దుకాణాలు సంబంధించిన రేకులు ఎగిరి పడడంతో అందులో ఉన్న వస్తువులు తడిసి ముద్దయ్యాయి. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో కురిసిన వర్షంతో ఉపశమనం కలిగినట్లయింది. రబీ పంటలకు ఈ వర్షం మేలు చేకూరుస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



కురుస్తున్న వర్షం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

త్వరితగతిన అర్జీలకు పరిష్కారం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతుల ద్వారా తెలిపే ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ చట్ట పరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 50 మంది ఫిర్యాదుదారుల నుంచి ఎస్‌పి వినతులను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులపై సానుకూలంగా స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ ఫోన్‌కాల్ ద్వారా మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్టపరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎస్‌పి స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు.

పదో తరగతి పరీక్షా కేంద్రం పరిశీలన

రణస్థలం: పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా మండలంలోని పైడిభీమవరం పరీక్షా కేంద్రాన్ని ఎస్‌ఇఆర్‌టి డైరెక్టర్, పదో తరగతి పరీక్షల రాష్ట్ర పరిశీలకులు మస్తానయ్య సోమవారం సందర్శించి పరీక్షా సరళిని పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, ప్రతిఒక్కరు కష్టపడి చదివి టైమ్ మేనేజ్‌మెంట్ చేసుకుంటూ పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు రావాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు సంబధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేనేజర్ బిషోయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస: మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు తాడి సంతోష్ అన్నారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పురపాలక సంఘం మేనేజర్ బిషోయ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న కళ్లేపల్లి శ్రీను కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. అలాగే ఇటీవల మృతి చెందిన కళ్యాణి, సింహాచలం కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఎన్.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.తారక, డి.రాజేష్, ఎన్. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పోలాకి: నరసన్నపేట నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న కలెక్టర్ల సదస్సులో వివరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం కలిశారు. వంశధార కాలువల షట్టర్ల మరమ్మతులు, గార-వనిత మండలం వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. పొలాల్లో మిగులు ధాన్యం కొనుగోలు, తాగు నీటి సమస్యలు, రోడ్లు, డ్రెయినేజీలు పూర్తి చేయాలని విన్న వించారు. ఈయనతో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

భగత్‌సింగ్ స్ఫూర్తి

టెక్కలి రూరల్: దేశ స్వాతంత్రం కోసం బ్రిటీష్ సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేసి 23 ఏళ్ల వయసులోనే ఉరికొయ్యను ముద్దాడాడు భగత్ సింగ్ అని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. మండలంలోని జక్కరపేటలో బోంతు ధర్మారావు అధ్యక్షతన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గుర్‌ల 94వ వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. పోరాటాలకు భగత్ సింగ్ పోరాటపటిమని మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని, స్థానిక సమస్యలను జోడిస్తూ... పోరాట మార్గాన్ని అనుసరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య అన్నారు. కార్యక్రమంలో అప్పారావు, రమేష్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

29న రణస్థలం మండల సమావేశం

రణస్థలం: రణస్థలం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు.

నేడు అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉన్న హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్టు ఆలయ ఇఒ వై.భద్రాజి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో ఉదయం 8 గంటలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, అర్చకులు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఆయన తెలిపారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి కష్టపడి చదువకోవడంతో పాటు వృత్తి నైపుణ్యం కోసం నైపుణ్యాభివృద్ధిని సాధించాలని, అప్పుడే మంచి ఉద్యోగావకాశాలను అందుకోగలరని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని, దేశ, విదేశాల నుంచి అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. ఎక్కడైనా ఉపాధి అవకాశాలు దక్కించుకోవాలంటే యువత విద్యతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించుకోగలరని సూచించారు. విద్యార్థులు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించుకోగలరన్నారు. ఈజాబ్ మేళాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారితో పాటు ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్‌లు

విద్యార్థుల ప్రతిభను గుర్తించి, ప్రతిభావంతులకు స్కాలర్ షిప్‌లు మంజూరు చేయడం గొప్ప విషయమని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని నాగావళి హోటల్‌లో మలబార్ గోల్డ్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు మంజూరైన స్కాలర్ షిప్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నగరంపల్లి పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు బి.ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు కేజీలు ఉండడంతో నీరు వృథాగా పోతుందన్నారు. అలాగే పైపుల్లోకి బురద చేరి నీరు కలుషితం అవుతుందన్నారు. దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చోలా వీధుల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారంలో కొట్టుమిట్టాడు తున్నారని అన్నారు. శివరాంపురానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగ బిల్లు కంటే 125 అదనపు ఛార్జీలు కలిపి పేదలపై భారం వేస్తున్నట్టు సంబంధత బిల్లులు ప్రజలు చూపిస్తూ.. ఆందోళన చేశారు. వీటిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ను వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం నాయకులు బి.సుగుణ, ఎన్.చంద్రయ్య, ఎన్.భైరాగి, బి.రామకృష్ణ, మోహనరావు, బి.లక్ష్మి, ఈశ్వరమ్మ నారాయణమ్మ పాల్గొన్నారు.

షాపుల తనిఖీ

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి పోలీసులు కెనన్ డాగ్స్‌తో పలు దుకాణాలను, వాహనాలను తనిఖీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర అక్రమ రవాణాలను అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఎస్ఐ పి.రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కును అందుకుంటున్న చంద్రశేఖర్ ఆజాద్

చంద్రశేఖర్‌కు అవార్డు

టెక్కలి : జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు పేడాడ చంద్రశేఖర్ ఆజాద్‌కు ప్రతిభా గుర్తింపు అవార్డు అందుకున్నారు. యువజన కాంగ్రెస్ జాతీయస్థాయిలో ఏటా నిర్వహించే యంగ్ ఇండియా కేబోల్ సీజన్-5 ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ రకాల పోటీల్లో భాగంగా ఉపన్యాస పోటీల్లో ఎపికి చెందిన ప్రతినిధి చంద్రవేఖర్ ఆజాద్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వివిధ విభాగాల్లో నిర్వహించే పోటీల్లో భాగంగా ఆజాద్ రాష్ట్రం తరుపున మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇందుకు రూ.50 వేలు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. చంద్రశేఖర్‌కు గుర్తింపు రావడంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

'కొత్తమ్మతల్లి' హుండీ ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి : స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించామని ఇఒ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. 60 రోజుల గాను హుండీ ఆదాయం రూ.3,63,923 వచ్చిందన్నారు. 185 గ్రాములు బంగారం, 6 కేజీల 15 గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు. టి.రవికుమార్, ఆలయ మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ బోయిన గోవిందరాజులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నగరంలోని ప్రైవేటు హోటల్‌లో జరిగింది. అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా గుంటముక్కల వీరభద్రరావు ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది మొదలవలస రాజేంద్రకుమార్, జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, డిఎస్‌డిఒ శ్రీధర్‌లు ఈ ఎన్నికలను పర్యవేక్షించారు. రాష్ట్ర బేస్‌బాల్ సంఘ పరిశీలకులు సిహెచ్ రాజేష్, విజయనగరం బేస్‌బాల్ కార్యదర్శి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా కిల్లంశెట్టి అరుణ్ కుమార్ గుప్తా, అధ్యక్షులుగా గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కొండపల్లి రవికుమార్, కోశాధికారిగా చీకటి మూర్తి, సహాధ్యక్షునిగా డి.రామాంజనేయులు, లకిలి రాంబాబు, నిమ్మాన విజయ శ్రీను, సహాయ కార్యదర్శులుగా తోటాడ శ్రీను, అందవరపు సంతోష్ కుమార్, ఇప్పిలి అరుణ్



కుమార్, సభ్యులుగా వి.గురుమూర్తి, కె.రమేష్, ఐ.సాయి కిరణ్, ఐ.గౌరిశంకర్, డి.రాజేష్, ఎం.మధు, కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బేస్‌బాల్ సంఘానికి గొప్ప విజయాలను అందించిన సీనియర్, సబ్ జూనియర్ కేటగిరి వరకు సుమారు 64 మంది క్రీడాకారులను ఉత్తమ క్రీడా ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు.

ఇసుక దోపిడీపై ఎందుకు మాట్లాడరు



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లేశ్వరరావు

ఆమదాలవలస: రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకుండా జరిగిన ఇసుక దోపిడీపై వైసిపి నాయకులు మాట్లాడకపోవడం శోచనీయమని జిల్లా టిడిపి కార్యవర్గ కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు అన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన వైసిపి సమన్వయకర్త రాష్ట్రస్థాయిలో బ్రాండ్ అంబాసిడర్‌గా వెలుగుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నిత్యం అసత్య ఆరోపణలతో విమర్శిస్తూ రాజకీయ గుర్తింపు పొందటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉచిత ఇసుక విధానంతో నేడు ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుండడంతో ఎంతో మేలు జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేస్తున్న ప్రభుత్వంపై ఎమ్మెల్యే రవికుమార్‌పై స్థాయిలేని చింతాడ రవికుమార్ అసత్య ఆరోపణలు చేస్తూ పదే పదే చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఇసుక విధానం, ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, స్థలం, సమయం చెబితే అక్కడకు వచ్చి గణాంకాలతో సహా వివరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నూక రాజు, సంపదరావు మురళీ, బోర గోవిందరావు, నాగళ్ల మురళీధర్ యాదవ్, బి.వి. రమణమూర్తి, కూన సంజీవ్ పాల్గొన్నారు.

మృతుడు అంబకండివాసిగా గుర్తింపు

పొందూరు: పొందూరు రైల్వేగేటు సమీపంలో ఆదివారం రైలు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు రేగిడి ఆమదాలవలస మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన బొడిసింగి వెంకట రమణ(25)గా గుర్తించినట్లు సోమవారం జిఆర్‌పి ఎస్ఐ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మృతుడు విజయవాడలోని తాపీ పనులు చేస్తుంటాడని, వారంరోజుల క్రితం వచ్చాడని, తిరిగి విజయవాడ వెళ్లేందుకు పొందూరు రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వచ్చాడన్నారు. ఈ క్రమంలో రైలుపట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు మృతుడి తండ్రి చిన్నారావు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి- బూర్జ



అప్పలస్వామి (ఫైల్)

మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మోదిలి అప్పల స్వామి (45) అనా రోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పలస్వామి మృతి సమాచారం తెలుసుకున్న ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారులు, సిబ్బంది కుటుంబసభ్యులను పరామర్శించారు.



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే స్టేషన్ వద్ద సోమవారం ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి ప్రాంతం టిక్కమాలకు చెందిన ఆమోద్ ఆనంద్ అనే వ్యక్తిని 22 కేజీల గంజాయితో పట్టుబడినట్టు కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకటఅప్పారావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టిక్కమాలకు చెందిన మరో నిందితుడు కబు ఆనంద్ అనే వ్యక్తితో ఆమోద్ ఆనంద్‌కు బంధుత్వం ఉందన్నారు. ఒడిశాలోని గంజాయి కొనుగోలు చేసుకొని ముంబాయిలో అమ్ముతుంటాడన్నారు. ముంబాయికి చెందిన మేథా అనే వ్యక్తి వీరికి గంజాయి కావాలని కోరడంతో ఆ మేరకు 22 కిలోల గంజాయి ఆరు ప్యాకెట్లుగా చేసుకొని బ్యాగుల్లో తరలిస్తున్నారని అన్నారు. పలాస రైల్వేస్టేషన్ వద్ద సిఐ పి.సూర్యనారాయణ ఆధ్వర్యాన తనిఖీ చేపడుతుండగా, పోలీసులు పట్టుకున్నారన్నారు. ఈ క్రమంలో నిఖిల్పాణి అనే వ్యక్తి పరారీ అయ్యారన్నారు. నిందితుడిని పలాస కోర్టులో హాజరు పరిచామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసుశాఖ నిఘా పెట్టామన్నారు. మొత్తం అన్నీ మార్గాల్లో తమ సిబ్బంది పహారా ఉన్నారన్నారు. ఏ చిన్న సమాచారం వచ్చినా తక్షణం స్పందించి గంజాయి ముఠాను పట్టుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. గంజాయి తాగినా, రవాణా చేసినా తమకు సమాచారం అందించాలన్నారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్

తీర్మానం లేని పనులు నిలుపుదల చేయాలి

పొందూరు: మండలం బాణాం పంచాయతీ తానెం గ్రామ పరిధిలో పంచాయతీ, గ్రామసభ ద్వారా గాని ఎటువంటి తీర్మాణాలు చేయకుండా చేపడుతున్న పనులను వెంటనే నిలుపుదల చేయాలని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో సర్పంచ్ ఎ.రాంబాబు ఫిర్యాదు చేశారు. కొంతమంది ప్రయివేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం రియల్‌ఎస్టేట్ భూముల అమ్మకం కోసం స్థానిక అధికారులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి ఎటువంటి జనవాసాలు లేని ప్రాంతంలో సిసి రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ సిసి రోడ్డు నిర్మాణం కోసం రూ.38 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. గ్రామసభ, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నిధులు మంజూరు చేసిన సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టి పనులు నిలుపుదల చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

లావేరు: రానున్న వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందేకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గురుగుబిల్లి సర్పంచ్ బాడిత కళ్యాణి అన్నారు. గురుగుబిల్లి కూడలిలో సోమవారం చలివేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పాదచారులు, వాహనదారులకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భవానీ, వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్‌పసాద్, డీలర్ హరికృష్ణ, బ్యాంక్ మిత్రా ప్రతిమ, సిఎఫ్ మల్లీశ్వరి, అప్పారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన చికిత్స



చిన్నారితో వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మెడికవర్ వైద్యులు రెండేళ్ల చిన్నారి గర్భంలో నుంచి ఎండో స్కోపిక్ ద్వారా అరుదైన చికిత్స నిర్వహించి లోహపు చీలమండను వెలికి తీశారు. చిన్నారి లోహపు చీలమండను మింగడం వల్ల జీర్ణ వ్యవస్థలోకి వెళ్లి డ్యూడెనం మూడో భాగంలో చిక్కుకున్నట్టు గుర్తించి ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ చైతన్యతో పాటు బృంద వైద్యులు ఎండోస్కోపిక్ స్నేర్‌ను ఉపయోగించి సున్నితమైన ప్రక్రియ ద్వారా చీలమండను సురక్షితంగా బయటకు తీశారు. ఎటువంటి సమస్యలు లేకుండా ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని వైద్యులు చైతన్య చెప్పారు. పిల్లల శరీరంలో ఇటువంటి వస్తువులు ఇరుక్కుపోవడం అనేది వైద్యపరమైన అత్యవసర పరిస్థితి అని, దీనికి తక్షణ రోగ నిర్ధారణ అవసరమన్నారు. వస్తువు వాయుమార్గంలో చిక్కుకుంటే, అది తీవ్రమైన శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుందని, అందువల్ల అధునాతన ఎండోస్కోపిక్ పద్ధతులను ఉపయోగించి దీనిని విజయవంతంగా తొలగించ గలిగామన్నారు. చిన్నారి తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదు, ఇంటర్మీడియట్ తరగతుల్లో చేరేందుకు వచ్చే నెల 6న చేపట్టనున్న ప్రవేశపరీక్ష వాయిదా పడినట్టు జిల్లా కో-ఆర్డినేటర్ బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను వచ్చే నెల 13న నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఈమార్పును గమనించాలన్నారు.

13 అర్జీలు స్వీకరణ

టెక్కలి : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 13 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూశాఖకు 8, విద్యుత్‌శాఖ, విద్యాశాఖ, వికలాంగులు, కాలుష్య బోర్డు, పంచాయతీ కోసం చెరో ఒక్కొక్కటి అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరిహారం పెంపుపై హర్షం

టెక్కలి: న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు అనారోగ్యానికి గురైతే ఇప్పటి వరకు రూ.లక్ష మంజూరయ్యేదని, దానిని మరో రూ.50 వేలుకు అదనంగా పెంచారని అన్నారు. విధానాలు మార్చుతూ తీసుకున్న నిర్ణయాలపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

టెక్కలి రూరల్: మండలంలో పోలవరం గ్రామ దేవత ఉత్సవాలు వచ్చేవారు ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా జాగ్రత్త వహించాలని సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. ఈ మేరకు కమిటీ పెద్దలకు సోమవారం పలు సూచనలు చేశారు. గ్రామంలోకి వాహనాలు విడిచి పెట్టరాదని, అలాగే ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు పార్కింగ్‌కు స్థలం కేటాయించామని, అందులో నిలుపుదల చేయాలన్నారు. సర్పంచ్ జి.బాలకృష్ణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

పనిఒత్తిడి తగ్గించాలి

కవిటి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు విజయవాడ చేరుకుని ఇఎన్‌సి కార్యాలయంలో అధికారి బాలునాయక్, డిప్యూటీ సిఎం కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో తమ రేషనైజేషన్ అవుతుందని భావించినా ఇంతవరకు చేపట్టలేదన్నారు. మరోవైపు ఐదారు శాఖల సమన్వయంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనిఒత్తిడికి గురవుతున్నట్టు తెలిపారు. ఇంతచేస్తున్నా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల రాష్ట్ర అధ్యక్షుడు షణ్ముఖ, జనరల్ సెక్రెటరీ శంకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ జయకృష్ణ పాల్గొన్నారు.

'జ్ఞానభారతి'లో యుకెజి పట్టా ప్రదానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థ కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన యుకెజి విద్యార్థులు కాన్వకేషన్ డే (పట్టా ప్రదానోత్సవం) సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ ఎస్.విశ్వనాథం పాల్గొని యుకెజి పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలతో అనుబంధాన్ని పెంచుకోవాలన్నారు. వారు చెప్పే విషయాలపై శ్రద్ధ వహిస్తూ... వారిని గమనించాలని సూచించారు. తమ పిల్లల భావోద్వేగాలను తల్లిదండ్రులు గమనిస్తూ, వారిని ప్రేమతో పెంచేందుకు, వారి సందేహాలను ఎంతో ఓర్పుతో తీర్చేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులతో నిరంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లల పరిణితిని తెలుసుకోవాలని సూచించారు. జోహార్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై మరింత మక్కువ చూపేందుకు పట్టా ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం



పట్టా ప్రదానం చేస్తున్న ఎంఇఒ విశ్వనాథం

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మదిలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్‌పండా, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీం ఖాన్ పాల్గొన్నారు.

పౌర సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పలు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీల అసోసియేషన్ల తరుపున పౌర సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావుకు వినతిపత్రాలను అందజేశారు. గత వారం రోజుల పాటు పలు కాలనీల్లో సర్వే నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్న అసోసియేషన్ ప్రతినిధులు వాటిని కమిషనర్‌కు వివరించారు. కాలనీల అసోసియేషన్ సమన్వయకర్త కె.శ్రీనివాసు ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సమస్యలన్నీ క్రోడీకరించి విజ్ఞాపన పత్రాలను అందజేశారు. ముందుగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజా సమస్యలు అపరిష్కృతంగా ఏళ్ల తరబడి మొగ్గుతున్నాయని, ప్రజల ఇబ్బందులను పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆస్తి పన్ను విపరీతంగా పెంచి ప్రజలపై పన్నుల భారాలు వేయడంలో ఉన్న శ్రద్ధ సమస్యలు పరిష్కరించడంలో చూపడం లేదన్నారు. కార్పొరేషన్‌లో విలీన పంచాయతీలుగా ఉన్న తిలక్ నగర్ కాలనీ లింకు రోడ్డును పరిరక్షించాలని కోరారు. నగర పరిధిలోని తుమ్మావీధిలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు నూతన భవనం నిర్మించాలని, ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ తరలించాలని, కత్తెర వీధిలో ప్రధానమైన రోడ్డు నిర్మించాలని కోరారు. కత్తెర వీధిలో ఉన్న విఆర్ఎల్ పార్శిల్ గోడౌన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇందిరానగర్‌తో పాటు ఇతర కాలనీలో పారిశుధ్య మెరుగుపరిచి, మురుగునీరు వెళ్లేందుకు వీలుగా కాలువలు నిర్మించాలన్నారు. వాటి నిర్వహణ బాధ్యతలను కార్పొరేషన్ ఆధ్వర్యాన చేపట్టాలన్నారు. సమస్యలను దశల వారీగా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కమిషనర్ ప్రసాదరావు అంగీకరించారు. కార్యక్రమంలో పలు కాలనీల ప్రతినిధులు ఎం.ప్రభాకరరావు, వై.శివకుమార్, పి.సుధాకరరావు, ఎస్.భాస్కరరావు, కె.నాగమణి, ఎ.లక్ష్మి, ఆర్.కరీంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలను అందజేస్తున్న కాలనీల ప్రతినిధులు



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస : కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రోటరీనగర్, మారుతీనగర్‌లో పలు సిమ్మెంట్ రోడ్లకు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొన్నారు. అలాగే 23వ వార్డు కావు వీధిలో పవర్ బోరును ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులను గుర్తించామని, తాత్కాలిక చర్యల్లో భాగంగా పవర్ బోరును ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, కూటమి నాయకులు బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, మల్లిపెద్ది నరేంద్ర, మోహనరావు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి ప్రశంసలు

పలాస మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఎమ్మెల్యే ప్రశంసించారు. ఇటీవల మెప్మా సిబ్బంది తయారు చేసిన వివిధ వస్తువులపై నాలుగు అవార్డులు, రికార్డులు సొంతం చేసుకొని, గిన్నీస్‌బుక్ రికార్డులో మెప్మా పేరు సొంతం చేసుకుంది. దీనిలో మెప్మా సిబ్బంది పాత్ర ఉండడం గుర్తించి ఆర్‌సిలకు, టిఎల్ఎఫ్ఒబిలకు గిన్నీస్ బుక్ రికార్డుల పత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టి.రాజ్యలక్ష్మి, సిటీమిషన్ మేనేజర్ పి.మోహనరావు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాన్ని అందుకుంటున్న వినోద్‌కుమార్

వినోద్ కుమార్‌కు ప్రోత్సాహకం

పలాస : మండలంలోని మాకన్నపల్లికి చెందిన కవి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కుత్తుం వినోద్ కుమార్ ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల స్థాయి నెల్లూరు కవి సంధ్య, యానం చిన్ననారాయణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన వచన కవితల పోటీల్లో నిర్వహించారు. ఉద్దానం ప్రాంత ప్రజా కవి వినోద్ కుమార్ హైదరాబాదక్షలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపి చేతులపై పురస్కారాన్ని అందుకున్నారు. నిత్యం తనదైనశైలిలో సామాజిక విషయాలపై కవిత్వం, పాటలు రాస్తున్న వినోద్‌కుమార్‌కు ఉద్దానం ప్రాంత కవి రచయితలు అభినందనలు తెలియజేశారు.



మాట్లాడుతున్న మోహనరావు

తూర్పుకాపు చైతన్య సదస్సుల నిర్వహణ

శ్రీకాకుళం అర్బన్ : తూర్పుకాపు సామాజిక వర్గం ఐక్యతను చాటి చెప్పేందుకు రానున్న రోజుల్లో మండలాల వారీగా చైతన్య సదస్సులను నిర్వహించనున్నట్టు తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్, లంక గాంధీ, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావులు అన్నారు. నగరంలో రామలక్ష్మణ జంక్షన్‌లో వెన్నెల హోటల్‌లో సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సామాజిక తరగతి ప్రాధాన్యతను పెంచడానికి క్షేత్రస్థాయిలో ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో డోల తిరుమలరావు, పొగిరి సుగుణాకర్, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పడాల తమ్మి నాయుడు, వి.శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్ పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామంలోని యువత శీతల పానీయాలు పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా ఓ అజ్ఞాత వ్యక్తి ఆర్థిక సాయంతో సోమవారం 400 మంది విద్యార్థులకు ఐస్ క్రీమ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ, ఆమదాలవలస

గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బూర్జ మండలంలోని సిఎస్‌పి రోడ్డు నుంచి కంట్లాం తారురోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.20 కోట్లతో నెల్లిపర్తి నుంచి కంట్లాం వరకు పది కిలోమీటర్ల తారు రోడ్డు పనులను ప్రారంభించారు. అల్లెన నుంచి మండల కేంద్రమైన బూర్జకు రూ.50 లక్షలతో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పల్లెకు పక్కా రోడ్లు వేస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, టిడిపి మండల అధ్యక్షులు సీతారాంబాబు నాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పిఎం అను సూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా సబ్సిడీ రుణాలను మండల మహిళా సమాఖ్య పరిధిలోని గాజుల కొల్లివలసకు చెందిన నవిరి రమ, కలివరం పంచాయతీ పరిధిలోని పీరుసాహెబ్‌పేటకు చెందిన



బూర్జ : రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బొడ్డేపల్లి పెంటమ్మకు వెల్డింగ్ షాప్ యూనిట్ల కింద రూ.రెండు లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఎంపిడిఒ ఆర్.వెంకటరావు, ఎపిఎం జి.నారాయణరావు, ఉపాధి హామీ ఇసి గట్టి రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

స్వర్ణాంధ్ర దిశగా చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పి4 మోడల్ ఆధారంగా సమాజంలోని అత్యంత నిరుపేద 20 మంది అభ్యున్నతికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని టిడిపి వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్, కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్ అన్నారు. 21, 22 వార్డుల సచివాలయాల పరిధిలోని సోమవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వం, దాతల, ప్రజల భాగస్వామ్యం, టాప్ 10 శాతం ప్రవాసులు, అధిక సంపన్నుల సహకారంతో పేదరికం నిర్మూలించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ

సోంపేట : ప్రతిఒక్కరూ నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బారువ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ కె.బాలకృష్ణ అన్నారు. ప్రపంచ హెల్త్ డే పురస్కరించుకొని దంత వైద్యులు అస్మైన్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు నోటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సమీపంలోని బాలుర వసతిగృహంలో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు దుర్యోధన, నరసింహ, శేఖర్, మిరవిందా, హిందూ, సిబ్బంది పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కు ప్రారంభం

పోలాకి : మండలంలోని గుప్పిడిపేట పంచాయతీ చిన్నకొవిరిపేటలో సోమవారం ఉపాధి హామీ నిధుల నుంచి మత్స్యకారులకు అందుబాటులో ఉండే విధంగా ఫిసింగ్ డ్రాయింగ్ ప్లాట్ ఫామ్, గోబుల్ వారి సౌజన్యంతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు ఎం.వెంకట అప్పలనాయుడు, డోల జగన్, భైరి భాస్కరావు, ఎస్.నారాయణదాస్, లబ్బ ధనలక్ష్మి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్లను ఆదుకోవాలి



ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- రణస్థలం

ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అధ్యక్షులు మెట్ట నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని బీరు పరిశ్రమ సమీపంలో ఉన్న లేఅవుట్‌లో సోమవారం రణస్థలం, లావేరు మండలాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు ప్రభుత్వానికి ఎన్నికల సమయంలో వారి సేవలు అందించినప్పటికీ సరైన గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. షాపులు పెట్టుకోవడానికి, కెమెరాలు కొనుగోలు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని కోరారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు చాలా పేదవారు ఉన్నారని ప్రభుత్వం గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అనంతరం రణస్థలం, లావేరు మండలాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బోర కోటేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా నల్లా నాగరాజు, కోశాధికారిగా పిల్లా శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా గురునాయుడు, సభ్యులుగా నారాయణరావు, బాబూరావు, సత్యారావు, హరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రెండు మండలాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి జెడ్‌పిటిసి గూడ ఎండయ్య ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమక్షంలో టిడిపిలో చేరారు. పాతపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తన అనుచరులతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపి నుంచి జెడ్‌పిటిసిగా గెలుపొంది మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అనుచరుడిగా ఉండేవారు. ఎమ్మెల్యే గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తున్న తీరును చూసి ఆకర్షితుడినై టిడిపిలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో



టిడిపిలో చేరుతున్న జెడ్‌పిటిసి ఎండయ్య

కొత్తూరు, వెంకటాపురం పంచాయతీ సర్పంచ్‌లు గూడ వసంతకుమారి, బెజ్జిపల్లి జయమ్మ పాపారావు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, హనుమంతు చంద్రశేఖర్, బమ్మిడి భాస్కరరావు ఒట్టుకోల చక్రీ పాల్గొన్నారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న రామ్‌చరణ్ అభిమానులు

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం వల్ల మరొకరి ప్రాణాలను దక్కించుకోగలమని అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను అన్నారు. సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వారంరోజుల పాటు నిర్వహించనున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రామ్‌చరణ్ యువశక్తి ఆధ్వర్యాన నగరంలోని న్యూబ్లడ్ బ్యాంకులో ఈ శిబిరాన్ని నిర్వహించారు. మెగా ఫ్యామిలీ అభిమానులు సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో వైశ్యరాజు మోహన్‌తో పాటు రామ్‌చరణ్ అభిమానులు మజ్జి గౌతమ్, సిద్ధూ, కళ్యాణ్, బాలాజీ, గణసాయి, మదన్, గోవింద్, హేమంత్ రెడ్డి, దినేష్, విజయ్, అల్లు అర్జున్ యువత అధ్యక్షులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సియాలిలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ సమితి సియాలిలో సబ్ కలెక్టర్ సోమవారం ప్రజా వినతులను స్వీకరించారు. గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం, సభ్యులు కడగల గోపాలరావు, యర్నాగుల ప్రసాదరావులు జిల్లాలోని సొసైటీల్లో గిడ్డంగులు, వే బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు సాగునీరు అందించాలని వినతిపత్రం అందజేశారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి తనూజ శతపతి, సభ్యులు ముచ్చి బంగారయ్య, లింగరాజు పాణిగ్రహీ వినియోగదారుల



వినతులను స్వీకరిస్తున్న అధికారులు

అనుమతి లేకుండా విద్యుత్ స్మార్ట్ మీటర్లను పెట్టడం సరికాదని అన్నారు. అటువంటి స్మార్ట్ మీటర్లు తొలగించి, పాత మీటర్లు కొనసాగేలా చేయాలని కోరారు. కిరాణా దుకాణాల్లో ధరల పట్టీలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల ధాన్యం ఇప్పటికీ ధాన్యం ఉన్నాయని, వాటిని కొనుగోలు చేయాలని కోరారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వేణుగోపాల్

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి క్రీడాకారుడు తన లక్ష్యాన్ని అధిగమించడానికి ఆ దిశగా పయనించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి పెన్కాక్ సిలాట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బరాటం సంతోష్, విఒ ఎఎస్ఎం అందవరపు సంతోష్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇంజనీర్ కొంక్యాన సురేష్, రౌతు సూర్యనారాయణ, మణిశర్మ, జ్యోతిర్మయి, హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు వై.హేమంత కుమార్, కోచ్ డి.హరీష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

టెక్కలి : టెక్కలి పట్టణంలోని సైనిక్ నగర్‌లో కాలువలు నిర్మాణం చేపట్టాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని, జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని బూరె నరేంద్ర, చక్రవర్తి కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో నివశిస్తున్న వారంతా ఉన్నత కుటుంబాలకు చెందిన వారని, కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు. రెండు పంచాయతీల నడుమ ఈ ప్రాంతం ఉండడం వల్ల సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. దీనిపై దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జన్ని పరమేశ్వరరావు, జర్జాన రాంజీ, ఏదూరు కామరాజు పాల్గొన్నారు.



అభినందిస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మన్మథరావు

ప్రజాశక్తి- పలాస

మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఇళ్ల మన్మథరావు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం విజయవాడలో రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. ఒకే రాష్ట్రం, ఒకే అసోసియేషన్ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ఎన్నికలు నిర్వహించారు. మన్మథరావు పోటీలో నిలబడి సంయుక్త కార్యదర్శిగా ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 130 సంఘాలు ఈ ఎన్నికల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సోమవారం పలాస రైల్వేస్టేషన్ చేరుకున్న మన్మథరావుకు మాజీ సైనికోద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలు వేసి స్టేషన్ వద్ద సత్కరించి ఇంటివరకూ తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు.



నియామకపత్రాన్ని అందుకుంటున్న వీరన్న

బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షునిగా వీరన్న

సోంపేట : బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షునిగా సోంపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మూల వీరన్న నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కన్వీనర్ దామోదరం ఆధ్వర్యాన వీరన్నకు నియామక పత్రాలు అందజేశారు. సందర్భంగా వీరన్న మాట్లాడుతూ తనపై ఉంచిన ఈ బాధ్యతను శక్తి వంచన లేకుండా పూర్తి చేస్తానన్నారు బాలల హక్కుల పరిరక్షణకు బాధ్యతగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన జాతీయ, రాష్ట్రస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.